సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 12 । మార్చి । 2023



సంచలనానికి నాంది..!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేటితో 13వ వసంతంలోకి అడుగు పెట్టనుంది. -8లో..



మా భూమిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆక్రమించారు

టీడీపీ మాజీ ఎమ్మెల్యే తన భూమిని కబ్జా చేశాడని నారా లోకేష్‌తో ఆ పార్టీ మహిళా నేత గోడు వెళ్లబోసుకుంది. -8లో..



26 ఎర్రచందనం దుంగల స్వాధీనం

సిద్దవటం రేంజ్ పరిధిలో 26 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. -8లో..

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సంబేపల్లె : పదోతరగతి విద్యార్థులు ఏకాగ్రత,పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నమయ్యజిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరీక్షలు కేవలం 20 రోజులు మాత్రమే ఉన్నాయని, పిల్లలు చదువుకొనే సమయంలో టీవీలు చూడనీయొద్దన్నారు.సెల్‌ఫోన్లు వాడరాదన్నారు. ఉపాధ్యాయులు సి గ్రేడ్, డిగ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు డీఈఓ రాఘవరెడ్డిని సన్మానించారు.

ఇంటర్, పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

రాయచోటి : ఇంటర్మీడియట్, పదోతరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులు, పోలీసులను ఆదేశించారు. శనివారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఇంటర్మీడియట్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్‌ఓ సత్యనారాయణ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీల వరకు ఇంటర్మీడియట్, ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీల వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయించాలని, 144 సెక్షన్ విధించాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షల్లో మాస్ కాపీలు జరగకుండా ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా, చిత్రంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రేపటి 'స్పందన' రద్దు

రాయచోటి: అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. శనివారం ఈ మేరకు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 13న జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నామన్నారు.

కోడ్ ఉల్లంఘనలపై కేసు నమోదు

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ నాయకులు ఉల్లంఘనలకు పాల్పడి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణ మోడల్ కోడ్ కండక్ట్ అధికారి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఫిర్యాదు మేరకు..పట్టణంలో కోడ్ ఉల్లంఘించి ఫ్లెక్సీలు, బ్యానర్‌లు ఏర్పాటుచేయడంపై టీడీపీ నాయకులపై కేసు నమోదుచేశామన్నారు.

క్లుప్తంగా

సీబీఐ విచారణలో కుట్ర కోణం

- వైఎస్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు యత్నం
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



రాజంపేట టౌన్ : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన విచారణను సీబీఐ నిష్పక్షపాతంగా జరపడం లేదని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీబీఐకి ప్రజల్లో విశ్వసనీయత ఉండేదని, అయితే వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి దస్తగిరి అనే వ్యక్తి అప్రూవర్‌గా మారి అతను చెప్పిన మాటలతో విచారణ సాగిస్తుండటంతో ఆ సంస్థ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందన్నారు. కేవలం అవినాష్‌రెడ్డిపై కక్ష కట్టి ఆయనను వివేకా హత్య కేసులో ఇరికించాలనే కోణంలో కొన్ని దుష్టశక్తులు పని చేస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ చేసి అసలు దోషులను పట్టుకోవాలని తాము కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు. వివేకా హత్య జరిగాక తొలిసారి ఫోన్ చేసి చెప్పింది శివప్రకాష్‌రెడ్డి అని, అందువల్ల ఆయనను విచారించాలని అవినాష్‌రెడ్డి కోరుతున్నా సీబీఐ పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్ష పార్టీలు వైఎస్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు పెద్దఎత్తున కుట్రలు పన్నుతున్నాయని, అందులో భాగమే అవినాష్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

రాజంపేట : పట్టణ శివారులోని ఓ ఆలయంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. పట్టణ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి శనివారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ సమీకృత బాలిక వసతి గృహంలో మైనర్ బాలికకు, ఓబులవారిపల్లె మండల చెన్నరాజుపోడుకు చెందిన యువకునికి వివాహం చేస్తున్నట్లు అందని సమాచారంతో ఎస్ఐతోపాటు సిబ్బంది వెళ్లారు. బాల్యవివాహం చేయడం నేరమని, అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు వచ్చి సంబంధీకుల నుంచి మేజర్ అయ్యే వరకు వివాహం చేయబోమని రాతపూర్వకంగా రాయించుకున్నారు.

సంచలనానికి నాంది..!

- 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం
- వైఎస్సార్ సమాధి ఘాట్ వద్ద పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ
- అనునిత్యం ప్రజల్లో ఉంటూ.. అలుపెరగని పోరాటం
- చరిత్రను తిరగరాసేలా పట్టం కట్టిన ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాల తోపాటు స్థానిక సంస్థల్లోనూ ఏకపక్షం
- వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి..



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ తదితరులు (ఫైల్)

సాక్షి కడప : కష్టాలు.. కన్నీళ్లు.. బెదిరింపులు.. భయాందోళనల మధ్య ప్రజలకు తోడుగా నిలిచేందుకు ఆవిర్భవించిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అప్పటి కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసే యోధుడు లేక ప్రజలు ఒక నాయకుడి కోసం ఎదురు చూస్తున్న సమయం. పాలనా పగ్గాలు చేతగాని కొంత మంది ప్రజలను వంచించే విధంగా ముందుకు వెళుతున్న సమయంలో పుట్టిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2011 మార్చి 12న ఆవిర్భవించింది.

వైఎస్సార్ ఘాట్ నుంచే శ్రీకారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం మొదలుకొని ప్రతి కార్యక్రమం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి ఘాట్ వద్ద నుంచే ప్రారంభిస్తూ వచ్చారు. పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం తలపెట్టినా ఇడుపులపాయ నుంచే మొదలు పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు సోదరి వైఎస్ షర్మిలమ్మ కూడా ఇడుపులపాయ నుంచే పాదయాత్ర చేశారు. అలాగే పార్టీ ఆవిర్భావం.. జెండా ఆవిష్కరణ.. అభ్యర్థుల ప్రకటనలు.. నామినేషన్ పత్రాలు.. మొదటి ప్లీనరీ .. ఇలా ఏ కార్యక్రమం తలపెట్టినా వైఎస్సార్ ఘాట్ వద్దకు వచ్చి ఆశీస్సులు తీసుకున్న తర్వాతనే ముందుకు కదిలేవారు. అంతెందుకు పార్టీలో ఏ కార్యక్రమం చేపట్టినా.. నాయకులు ఏదైనా తలంచినా అమలు చేసేందుకు వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచే శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా మారింది.

చరిత్ర తిరగరాసిన ఉప ఎన్నికలు

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బయటికి వచ్చిన అప్పటి ఎంపీ, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ (అప్పటి పులివెందుల ఎమ్మెల్యే)లు తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. వారు అందుకున్న విజయం చరిత్ర నివ్వెరపోయేలా పులివెందుల, కడప పార్లమెంటు ప్రజలు తీర్పునిచ్చారు. 2011 మే నెలలో జరిగిన ఉప ఎన్నికలు దేశ స్థాయిలో చర్చ జరిగేలా చేశాయి. కాంగ్రెస్, టీడీపీ పెద్దలు జిల్లాలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కట్టడి చేయాలని రాష్ట్రంలోని నాయకులంతా వచ్చి పులివెందుల, కడపలో వాలినా ఏమాత్రం జంకు బొంకు లేకుండా ఒక్కడే నిలబడి పోరాడారు. ఫలితం అప్పట్లో జరిగిన ఉప ఎన్నికల్లో కడప ఎంపీ స్థానానికి సంబంధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 5.44 లక్షలకు పైగా మెజార్టీతో అఖండ విజయం సాధించి పార్లమెంటు స్థాయిలో రికార్డు సృష్టించారు. మరో పక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు, వైఎస్ జగన్ తల్లి వైఎస్ విజయమ్మ కూడా ప్రత్యర్థిపై 80 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కూడా జిల్లాకు సంబంధించి రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటిలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఎన్నికలు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయఢంకా మోగిస్తూ వస్తున్నారు.

అనునిత్యం ప్రజల్లో.. అందుకే పట్టం

2011 నుంచి మొన్నటి 2019 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా.. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అనునిత్యం వారి మధ్యనే గడిపారు. నాటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజా క్షేత్రంలో పోరాటాలు చేస్తూనే ముందుకు కదిలారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించారు. మన కోసం పోరాడుతున్న నేతకు పట్టం కట్టాలని నిర్ణయించుకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతోపాటు 22 లోక్‌సభ స్థానాలను అందించారు. అలా 2011 నుంచి 2019 వరకు ప్రజల్లో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడంతో నేడు ఆయన ప్రజా సేవలో అంకితమయ్యారు.

అన్ని ఎన్నికలు ఏకపక్షమే

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం కొనసాగుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలతోపాటు 10 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ అదే ఊపుతో తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ విజయ దుందుభి మోగించింది. ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా తీర్పునిస్తున్నారు. కార్పొరేషన్, మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఇలా ఎన్నికలు ఏవైనా జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. వైఎస్ కుటుంబంపై జిల్లా ప్రజలు తమ ప్రేమాభిమానాలను ఓట్ల రూపంలో చూపుతుండడంతో వైఎస్సార్ సీపీకి తిరుగులేని ఆధిక్యత లభిస్తోంది.

13 వసంతంలోకి వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి నేటి (ఆదివారం)కి సరిగ్గా పన్నెండేళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ తరఫున పలు కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించారు. పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలతోపాటు దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలమలలతో ఘనంగా నివాళులర్పించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే పార్టీ అధిష్టానం నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

కుమార్తెలతో సహా తల్లి ఆత్మహత్యాయత్నం

- భర్త మరో మహిళతో వెళ్లిపోవడంతో మనస్తాపం
- కూతుర్లకు విషమిచ్చి తానూ తాగిన వైనం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లీకుమార్తెలు

మదనపల్లె : భర్త సమీప బంధువుతో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ కుమార్తెలతో సహా ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిప్పిలి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఆయనకు భార్య నాగమణి(30), కుమార్తెలు పుష్పవతి(11), వైశాలి(9) ఉన్నారు. ఒకరు ఐదో తరగతి, మరొకరు నాలుగో తరగతి చదువుతున్నారు. భర్తతోపాటు నాగమణి కూలి పనులకు వెళుతోంది. అయితే ఏడాది కాలంగా భర్త సమీప బంధువుతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యాపిల్లలను నిర్లక్ష్యం చేశాడు. ఆయనకు మద్దతుగా కొందరు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ సమస్యపై ఇటీవల బాధితురాలు నాగమణి తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల స్పందన సరిగా లేకపోవడంతో మనస్తాపంతో తనకు జరిగిన అన్యాయం, వేధింపులపై సూసైడ్ నోట్ రాసి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. మొదటగా కుమార్తెలకు పురుగుల నివారణ మందు తాపించి, తర్వాత తానూ తాగింది. గమనించిన స్థానికులు వారిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నారు. తనపై వేధింపులకు పాల్పడి, భర్తతో వివాహేతర సంబంధం కలిగిన మహిళపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది.

ప్రమాదాల నివారణకు చర్యలు



ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : జిల్లా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ప్రమాదకరమైన మలుపులు, ఘాట్ రోడ్లలో జరుగుతున్న ప్రమాదాల నివారణకు రూ.3 లక్షలతో కొనుగోలు చేసిన కాన్వెక్స్ మిర్రర్లు, ఎల్ఈడీ లైట్ బ్యాటిన్స్, రేడియం జాకెట్లను ఆయన శనివారం సిబ్బందికి అందజేశారు. జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మీడియాతో మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా 40 ప్రాంతాల్లో ప్రమాదకరమైన మలుపులను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో ప్రమాదాలను అరికట్టే క్రమంలో ఈ కాన్వెక్స్ అద్దాలను అమర్చడం జరుగుతుందన్నారు. ఇలా ఏర్పాటు చేయడం వల్ల మలుపులలో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని కాన్వెక్స్ అద్దాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే హైవే పెట్రోలింగ్, రక్షక్, బ్లూకోల్ట్స్‌లను బలోపేతం చేయడంలో భాగంగా వారికి ఎల్ఈడీ లైట్ బాటిల్స్, రేడియం జాకెట్లు అందజేశామన్నారు. హైవే పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం రహదారులపై తిరుగుతూ ప్రజలకు అవసరమైన సమయాలలో సహాయపడేలా సూచనలు ఇచ్చామన్నారు. కొత్తగా శిక్షణ పొందిన సిబ్బంది సంబంధిత పోలీస్ స్టేషన్లకు అనుసంధానంలో ఉంటూ నిబద్ధతతో పని చేస్తారన్నారు. ప్రధాన రహదారులపై వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూసేలా సిబ్బంది చర్యలు తీసుకుంటారని చెప్పారు.

సోమశిల వెనుక జలాల్లో మృతదేహం

నందలూరు(రాజంపేట) : నందలూరు మండల పరిధిలోని సోమశిల ప్రాజెక్ట్ వెనుక జలాలు(బ్యాక్ వాటర్)లో శనివారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. కొండమాచుపల్లె (సోమశిల ముంపు గ్రామం) పరిధిలోని పల్లాగట్టు వద్ద నిలకడగా ఉన్న బ్యాక్‌వాటర్ నుంచి ఈ మృతదేహం కొట్టుకువచ్చింది. చనిపోయిన వ్యక్తి 35 ఏళ్ల వయసు కలిగి వుంటాడని, చేపలు పట్టి జీవించేందుకు వచ్చిన కూలీగా స్థానికులు చెబుతున్నారు. చేపల వ్యాపారస్తుడు ఇంటికి పంపకపోవడంతో నీళ్లలోకి దూకి పారిపోయే ప్రయత్నంలో మృతి చెందినట్లుగా ముంపు వాసులు చెప్పుకొంటున్నారు. మృతదేహం సమాచారం అందుకున్న ఏఎస్ఐ సుబ్బరాయుడు, హెడ్‌కానిస్టేబుల్ రహీం తమ సిబ్బందితో అక్కడికి వెళ్లే సరికి నీటి తాకిడి కొట్టుకుపోయినట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ మృతదేహం పూర్తి వివరాలు తెలియవని, మృతదేహం నీటి ఉధృతికి కొట్టుకుపోయిందని, బయటపడితే గానీ చెప్పలేమని, స్థానికులకు సమాచారం ఇచ్చి వచ్చామన్నారు.

దారి దోపిడీ దొంగ అరెస్ట్

– ద్విచక్రవాహనం, నగదు స్వాధీనం

పెనగలూరు : చక్రంపేట వద్ద బుధవారం దారి దోపిడీకి పాల్పడిన తోడేటి పెంచలయ్యను పోలీసులు కొండూరు క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశారు. అతన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మీడియా ఎదుట హాజరు పరిచారు. ఈ సందర్భంగా సీఐ పుల్లయ్య వివరాలు వెల్లడించారు. పెనగలూరు గ్రామానికి చెందిన వీడియో గ్రాఫర్ మీసాల నవీన్ కుమార్ తన వృత్తి నిమిత్తం చిట్వేలికి వెళ్లి రాత్రి 12 గంటల సమయంలో తిరిగి వస్తున్నాడు. సాయి వికాష్ పాఠశాల వద్ద అతన్ని చిట్వేలి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న తోడేటి పెంచలయ్య, బాలవర్దన్ నాయుడు (బాలు) చాకుతో బెదిరించారు. నవీన్ కుమార్ వద్ద నుంచి రూ.5 వేల నగదు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లారు. బాధితుడు గురువారం పెనగలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ హేమాద్రి ఆధ్వర్యంలో సిబ్బంది పెంచలయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.2 వేల నగదు, సిల్వర్ కలర్ చాకు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న బాలవర్దన్ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. బాలవర్దన్ నాయుడు, పెంచలయ్య ఇప్పటికే మోటార్ సైకిళ్ల దొంగతనంలో ఒకసారి అరెస్టు అయ్యి ఉన్నారు.

పూరిల్లు దగ్ధం

– రూ.2 లక్షల ఆస్తి నష్టం



తంబళ్లపల్లె : అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగిన సంఘటన శనివారం మండలంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోపిదిన్నె పంచాయతీ బళ్లాపురంపల్లెకు చెందిన సుశీలమ్మ ఒంటరి మహిళ. పూరింటిలో ఉండి కూలి పనులు చేసుకుని జీవించేది. ఆమె ఉదయం పనికి వెళ్లగా మధ్యాహ్నం వేళ ఇంటిలో విద్యుత్ వైర్ల షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంటల కారణంగా ఇంటిలోని గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలింది. మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు రూ.లక్ష నగదు, 30 గ్రాముల బంగారు, దుస్తులు, వంట పాత్రలు కాలి బూడిదయ్యాయి. తాను ఇక ఎలా బతకాలని ఆమె రోదించడం పలువురి హృదయాలను కలచి వేసింది. ప్రభుత్వం ఆమెను ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మా భూమిని టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆక్రమించారు

లోకేష్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



లోకేష్ శిబిరం వద్ద బాధితురాలు రాణెమ్మ

కురబలకోట : 'లోకేష్ సార్.. మీరు యువగళం పాదయాత్ర శిబిరం ఏర్పాటు చేసిన భూమి మాదే. మేము కొంత అమ్మితే మొత్తం అమ్మినట్లు టీడీపీ మదనపల్లె మాజీ ఎమ్మెల్యే రాసుకుని మోసంతో కబ్జా చేశాడు. రికార్డులు తారుమారు చేసి ఆయన స్వాధీనంలో ఉంచుకున్నారు.. మాకు న్యాయం చేయాలి' అని కురబలకోట మండలం గౌనివారిపల్లెకు చెందిన డి.రాణెమ్మ శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసి గోడు వెళ్లబోసుకుంది. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ శుక్రవారం రాత్రి చేనేత నగర్ శిబిరానికి చేరుకున్నారు. శనివారం ఉదయం ఆమె శిబిరంలో నారా లోకేష్‌ను కలిసి తనకు మదనపల్లె టీడీపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే చేసిన అన్యాయంపై ఫిర్యాదు పత్రం అందజేశారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఆమె తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాణెమ్మ కుటుంబీకులకు పూర్వీకుల నుంచి హైవే పక్కన పది ఎకరాల పొలం సంక్రమించింది. ఈ భూమికి సంబంధించి పహానీ, అడంగలు కూడా చూపుతోంది. ఇందులో కుటుంబ అవసరాలకు రెండు ఎకరాలు అమ్మారు. మిగిలిన భూమి సాగు చేసుకునే వారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే ఒకరు తన బంధువైన ఎం.కృష్ణమూర్తి నాయుడు పేరిట సర్వే నంబరు 111/3లో 4.80 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నాడని బాధితురాలు పేర్కొన్నారు. దీంతో ఈ భూమిలోకి తనను రాకుండా చేశాడని వాపోయారు. 15 ఏళ్లుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. తాను దళితురాలినని, ఆపై నిరుపేదనని, మాజీ ఎమ్మెల్యేతో పోరాడ లేని నిస్సహాయురాలినని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే చెరలోని భూమిని తనకు అప్పగించాలని లోకేష్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు ఎం.భీమేశ్వరరావును విచారణ చేయగా సదరు భూమి ప్రస్తుతం ఎం.కృష్ణమూర్తి నాయుడు పేరిట ఉందన్నారు. ఇది డీకేటీ భూమి అని తెలిపారు. ప్రస్తుతం సదరు భూమి వ్యవహారం కోర్టులో నడుస్తోందన్నారు. ప్రస్తుతం భూమి స్వాధీనంలో ఉన్న వారిని విచారణ చేయగా ఆ భూమి అక్రమంగా రాలేదని, సక్రమంగా వచ్చిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన భూ రికార్డులు కూడా ఉన్నాయన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

జిల్లా ఆస్పత్రిలో రాష్ట్ర కాయకల్ప బృందం తనిఖీలు



జిల్లా ఆస్పత్రిలో రోగులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర కాయకల్ప వైద్యులు

మదనపల్లె : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర కాయకల్ప బృందం వైద్యులు హేమంత్‌కుమార్, సురేంద్రకుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వారు తనిఖీలు నిర్వహించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. వార్డులో పర్యటించి రోగులను అడిగి పలు విషయాలు తెలుసుకున్నారు. వైద్య సేవలు, వైద్యుల సమయపాలన, ఆస్పత్రిలో జరుగుతున్న శస్త్రచికిత్సలు, కేసుల రెఫర్, భోజన నాణ్యత తదితర అంశాలపై రోగులను విచారణ చేశారు. అదే విధంగా ఆరోగ్యశ్రీ, మెటర్నటీ, ఏఆర్‌టీ, ఐసీటీసీ, క్యాజువాలిటీ, ఐసీయూ, ఓపీ, డ్రగ్స్‌స్టోర్, ల్యాబ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని వసతులతో కూడిన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని విభాగాల డాక్టర్స్, సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. మాతాశిశుమరణాల నివారణకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. హైరిస్క్ కేసులను ప్రత్యేక శ్రద్ధతో చూడాలన్నారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రి తనిఖీపై నివేదికలు ప్రభుత్వానికి అందిస్తామన్నారు. వాటి ఆధారంగా ఆస్పత్రికి గ్రేడింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. గ్రేడింగ్ ద్వారా ఆస్పత్రి కాయకల్ప బహుమతికి ఎంపికవుతుందని, వాటి ద్వారా వచ్చే నిధులతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి క్వాలిటీ కంట్రోల్ విభాగం జిల్లా అధికారిణి ప్రభావతి, ఆర్ఎంఓ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

26 ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, సిద్దవటం బీట్ల అటవీ ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేంజర్ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు రేంజర్‌తోపాటు సిబ్బంది మంగళవారం సాయంత్రం నుంచి సిద్దవటం రేంజ్‌లోని రోళ్లబోడు బీటు, సిద్దవటం బీట్లలో రెండు బృందాలుగా విడిపోయి కూంబింగ్ నిర్వహించారు. సిద్దవటం బీటులోని సాలుపెంట, ఉప్పుగుంతలు, చెంచల చలిమి రస్తా ప్రాంతానికి శుక్రవారం సాయంత్రానికి వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రచందనం దుంగలను తీసుకెళ్తుండగా సిబ్బందిని చూసి పారిపోయారు. వారు వదిలేసి వెళ్లిన 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రోళ్ల బోడు బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న మరో బృందం శుక్రవారం సవర్ల బావి రస్తాకు చేరుకుంది. ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్న తమిళ కూలీలు వారిని చూసి పరారయ్యారు. అక్కడ ఉన్న 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు బీట్లలోని 26 ఎర్రచందనం దుంగలను సిద్దవటం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. వాటి బరువు 617 కిలోలు, విలువ రూ.2.77 లక్షలు ఉంటుందని రేంజర్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కూంబింగ్‌లో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, ఏబీఓలు హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు శివారెడ్డి, శివరాం, నాగిరెడ్డి, సునీల్, మహేష్, అనీల్, సాబ్‌బావి, బంగ్లాబావి, బేస్ క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.